www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



పథకాల అమలుపై సమన్వయ సమావేశం


రేపు భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహణ

ఏలూరు జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి


ఇడి ఎం.ముక్కంటి

భీమవరం : కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు, యువ వ్యాపార వేత్తలకు బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న పథకాలపై అవగాహన, సహకారం అందించేందుకు సంబంధిత బ్యాంకు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి తెలిపారు. భీమవరం మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 5వ తేదీన ఉదయం 10:30కు సమావేశం మందిరంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి కలిగిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు, యువ వ్యాపారవేత్తలు అవగాహన సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేవీ ఆయుధ డిపో వద్దే.. వద్దు..




ప్రదర్శనగా గ్రామాల్లో పర్యటిస్తున్న వామపక్ష నేతలు

- మూడు పంటలు పండే భూముల్లో ఎలా పెడతారు
- ఎంఎల్ఎ ఇంటి పక్కన అటవీ భూముల్లో ఏర్పాటు చేయండి
- మాలో విబేధాలు సృష్టించి డిపో ఏర్పాటుకు కుటిలయత్నాలు
- వామపక్ష రాష్ట్ర నేతల పర్యటనలో గిరిజనుల ఆవేదన
- కలెక్టర్, ప్రజాప్రతినిధులు చట్టాలను గౌరవించాలి : వామపక్ష నాయకులు
- గ్రామసభ తీర్మానం చేశాక కేబినెట్ తీర్మానం కూడా చెల్లదు
- గిరిజనులకు అండగా ఉంటామని నేతల భరోసా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి


మూడు పంటలు పండే భూముల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేసుకునే అవకాశమున్నా పట్టించుకోవడం లేదని జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని దాట్లవారిగూడెం, రమణక్కపేట, మడకంవారిగూడెం, కొత్త సీమలవారిగూడెం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ ఆయుధడిపోకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులకు అండగా నిలిచేందుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు బాధిత గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవన్, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు సుధీర్, సిపిఐ (ఎంఎల్) నాయకులు నాగరాజుతోపాటు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎ.రవి. మన్నవ కృష్ణచైతన్య, ఆదివాసీ సంఘం నాయకులు మడకం వెంకటేశ్వరరావు, మానవ హక్కుల సంఘం నాయకులు పొట్టా


సభకు హాజరైన గిరిజనులు

నాగేశ్వరరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, తెల్లం దుర్గారావు, కారం ధారయ్య, భూషణం, దుర్గారావు, కారెం భాస్కర్ ఇతర నాయకులు ఉన్నారు. వామపక్ష నాయకులు ముందుగా మడకంవారిగూడెం చేరుకోగా గ్రామ పొలిమేరల్లోకి గ్రామస్తులంతా వెళ్లి పూలమాలలు వేసి, పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో వద్దు, గిరిజనుల పొట్ట కొట్టొద్దు, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాల్లి అంటూ పెద్దఎత్తున నినదించారు. ఆయుధ డిపో ఏర్పాటుకు నిర్ధారించిన కొత్త సీమలవారిగూడెం గ్రామానికి వెళ్లి అక్కడి గ్రామాన్ని, పామాయిల్ తోటలను పరిశీలించారు. అక్కడి గిరిజనులతో నేతలు మాట్లాడారు. అక్కడ నుంచి దాట్లవారిగూడెం చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఐదు గ్రామాల ప్రజలతోపాటు, ఏజెన్సీలోని వివిధ ప్రాంతాల వారు సైతం పాల్గొని మద్దతు తెలిపారు. ముందుగా బాధిత గిరిజన ప్రజలు, పీసా కమిటీ నాయకులు అక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎ.వనజ, ఇతర వామపక్ష నాయకులు మాట్లాడుతూ మూడు పంటలు పండే భూముల్లో ఆయుధ డిపో ఏర్పాటు చేయడం తగదన్నారు. గ్రామసభలో ఆయుధ డిపోను వ్యతరేకిస్తూ తీర్మానం చేసిన తర్వాత కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు అడ్డగోలు ముందుకెళ్లాలని యత్నించడం ఏమాత్రం మంచిది కాదన్నారు. ప్రజాభిప్రాయానికి విలువ లేదా అని ప్రశ్నించారు. గ్రామసభలకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన తర్వాత కేబినెట్ తీర్మానం చేసినా చెల్లదన్నారు. ఐదు గ్రామాల్లో 1,166 ఎకరాల భూములు తీసుకుంటే ఇక్కడి ప్రజలకు ఉపాధి ఏవిధంగా దొరుకుతుందన్నారు. ఎంఎల్ఎ ఇంటి పక్కగా మూడు వేల అటవీ భూములు ఉన్నాయని, అక్కడ ఆయుధ డిపో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, అభివృద్ధి వంటి బూటకపు మాటలు చెప్పొద్దని, అన్నీ త్యాగం చేసిన పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటనేది అందరూ చూస్తున్నారన్నారు. గ్రామస్తుల అభిప్రాయానికి వ్యతిరేకంగా వెళ్తే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని, గిరిజనులకు వామపక్షాలు అండగా ఉంటాయని తెలిపారు. పోలీసులతో కేసులు పెట్టాలని చూస్తే ఎవరూ భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ గ్రామాల్లో ఆయుధ డిపో ఏర్పాటుకు అంగీకరించే ప్రసక్తి లేదని గిరిజనులంతా ముక్తకంఠంతో తెలిపారు.

అనుమతి నిరాకరించి.. మళ్లీ వెనక్కి తగ్గి

వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం పర్యటనకు సంబంధించి ఆ పార్టీల జిల్లా నాయకులు ముందుగా పోలవరం పోలీస్ డివిజన్ అధికారులను అనుమతి కోరుతూ దరఖాస్తు చేశారు. ఆదివారం రాత్రి అనుమతి నిరాకరిస్తూ వెనక్కి లేఖ పంపారు. ఆ లేఖలో ఆయుధ డిపో రక్షణశాఖకు సంబంధించిందని, ధర్నాలు, ఆందోళన చేయడం నిషిద్ధమని అనేక అంశాలను పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా కలెక్టర్, ఆర్‌డిఒలు అనుమతి కోరాలంటూ ముక్తాయించడం కొసమెరుపు. దీంతో పోలీసులు వామపక్ష నాయ కులు పర్యటనను అడ్డుకుంటారనే ప్రచారం సాగింది. వామపక్ష రాష్ట్ర నాయకుల కార్యక్రమాన్ని అడ్డుకుంటే రాష్ట్రవ్యాప్తంగా అలజడి రేగే అవకాశం ఉందని గమనించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.


కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినదిస్తున్న కౌలు రైతులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి


ఎడిట్ ఆప్షన్ ఇచ్చి నష్టం నమోదు చేసి పరిహారం చెల్లించాలి

కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రామాంజనేయులు

కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం కలెక్టర్, డిఆర్ఒకు వినతులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా కౌలురైతుల స్థితిగతులు మారట్లేదని, తక్షణం కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉదుర్తి శ్రీనివాసరావు, మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కౌలు రైతులు భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలురైతులందరికీ వెంటనే 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలని, కౌలురైతులకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి పంట నష్టం నమోదు చేసి పరిహారం, పంటరుణాలు ఇవ్వాలని నినదించారు. కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ బైఠాయించి ధర్నా చేపట్టారు. డిఆర్ఒ బి.శివన్నారాయణ అక్కడకు చేరుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, శ్రీనివాసరావు వినతిపత్రాన్ని అందజేసి కౌలు రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో వ్యవసాయం 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలుచట్టం ప్రకారం ఒప్పంద పత్రంపై భూయజమానులు సంతకం పెట్టేందుకు అంగీకరించడం లేదన్నారు. కౌలు గుర్తింపు కార్డులు అందక, కౌలురైతులకు ప్రభుత్వ రాయితీలు రాక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొంథా తుపాన్‌కు జిల్లాలో అనేక గ్రామాల్లో కౌలురైతుల పంట దెబ్బతిందని, అయితే ప్రస్తుతం అమలులో ఉన్న


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

కౌలుచట్టం నిబంధనలతో కౌలుకార్డులు ఇవ్వడానికి అంగీకరించని భూయజమానులు పంట నమోదు కూడా వారి పేరునే చేయించుకున్నారని ఆరోపించారు. దీంతో పంటనష్టం కౌలురైతులకైతే, పరిహారం భూయజమానులకు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు కౌలురైతులకు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కౌలు రైతులకు రిజర్వుబ్యాంక్ నిబంధనల ప్రకారం ప్రతి కౌలురైతుకీ రూ.2 లక్షలు పంట రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కౌలురైతులు కవురు శ్రీనివాస్, కూసంపూడి సుబ్బరాజు, పెచ్చెట్టి నర్సింహమూర్తి, కేతా పూర్ణారావు, పంపన నాగరాజు, మన్నె నగేష్, భారతల నాగేశ్వరరావు, పిల్లి కామేశ్వరరావు, కర్రి నాగిరెడ్డి, చింతా నారాయణమూర్తి, కేతా జ్యోతిబసు, దోమా చంద్రపౌలు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన


ఆచంటలో కురుస్తున్న వర్షం

పజాశక్తి - ఆచంట

ఉదయం ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు మధ్యాహ్నం సమయంలో కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లబడి సేదతీరారు. నాలుగు రోజులుగా మండలంలో రాత్రిపూట చలిగాలులు, తెల్లవారుజామున మంచు, పగటి వేళల్లో ఉక్కపోతతో జనం తల్లడిల్లుతున్నారు. దీంతో పలువురు అనారోగ్యాల బారిన పడుతున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. డ్రెయిన్లు ఎప్పటిలానే పొంగిపొర్లి బురద నీరు రోడ్లపైకి చేరడంతో జనం రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు: సోమవారం మధ్యాహ్నం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక్కసారిగా


మొగల్తూరులో కురుస్తున్న వర్షం

వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, ఆకాశం మేఘావృతమైంది. ఒకపక్క ఎండ, మరో పక్క వాన కురిసింది.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ నాగరాణితోపాటు డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 231 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. శాఖలవారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మీ డబ్బు.. మీ హక్కు

లావాదేవీలు జరపని ఖాతాల్లో నిరుపయోగంగా రూ.100 కోట్లు

ఆర్‌బిఐ కల్పించిన వెసులుబాటును వినియోగించుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

'మీ డబ్బు.. మీ హక్కు' అని, ఖాతాదారులు ఆర్‌బిఐ కల్పించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. దీర్ఘకాలంగా బ్యాంకు లావాదేవీలు నిర్వహించని ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, నగదు వాపస్ తీసుకోవడానికి ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో 'మీ డబ్బు.. మీ హక్కు' అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ నాగరాణి, ఎల్‌డిఎం నాగేంద్రప్రసాద్, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, పోస్టాఫీస్ ఖాతాల్లో నిరుప యోగంగా ఉన్న డిపాజిట్లు, ఖాతాలను పునరుద్ధరించు కోవడానికి ఆర్‌బిఐ అవకాశం కల్పించిందన్నారు. 10 సంవత్స రాలుగా ఎటువంటి లావాదేవీలు జరపని ఖాతాలకు సంబంధించి తమ బ్యాంకు శాఖలకు వెళ్లి అకౌంట్ పునరుద్ధరణ లేదా డబ్బు తీసుకో వచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఆధార్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ ఏదోకటి సమర్పించాలన్నారు. లావాదేవీలు నిర్వహించని బ్యాంకు ఖాతాలలో సొమ్ము వివరాలు తెలుసుకోవడానికి https://udgam.rbi.org.inలో లాగిన్ ద్వారా తమ, తమ బ్యాంకు ఖాతాల్లో ఎంత మేర సొమ్ము ఉన్నది తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలో వివిధ బ్యాంకుల్లో దీర్ఘకాలంగా లావాదేవీలు జరపని ఖాతాల్లో రూ.87 కోట్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా పోస్టాఫీస్, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఖాతాల్లో మరో రూ.20 కోట్లు ఉన్నాయన్నారు.

నలుగురు అధికారులకు రాష్ట్రస్థాయి అవార్డులు

సిఎం చేతుల మీదగా అవార్డుల ప్రదానం

ప్రత్యేకంగా అభినందించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మొంథా తుపాన్ సమయంలో సంసిద్ధత, సహాయ కార్యకలాపాల్లో అంకితభావం, నాయకత్వం, అవిశ్రాంత కృషికి గుర్తింపుగా రాష్ట్రస్థాయి అవార్డులకు పంచాయతీరాజ్‌శాఖ ఇఇ సత్యనారాయణ, ఎఇ నాగేశ్వరరావు, మత్స్య శాఖ ఎడి ఎల్ఎల్ఎన్.రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ తాడి లోకేష్‌ను ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా విజయవాడలో అవార్డుల ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్లో జిల్లా అధికారుల సమక్షంలో కలెక్టర్ నాగరాణి అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాన్ సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చాయని కితాబిచ్చారు.

అన్ని శాఖలు సమాంతర సేవలను అందించినా, తీర ప్రాంతంలో విశిష్ట సేవలు అందించిన మూడు శాఖల ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేసిందన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు భవిష్యత్తులో ఇదే సహకారంతో పని చేసి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని కోరారు.

వ్యకాస జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

10, 11 తేదీల్లో అత్తిలిలో నిర్వహణ

సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - అత్తిలి(తణుకు)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నవంబర్ 10, 11 తేదీలలో అత్తిలి షాదీ ఖానా భవనంలో జరుగుతాయని తెలుపుతూ మహాసభలు జయప్రదం చేయాలని అత్తిలి పురవీధుల్లో ప్రజల నుండి, వ్యాపారుల నుండి విరాళాల సేకరణ చేశారు. విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, సహాయ కార్యదర్శి బండ్ల బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ.. సంఘం జిల్లాలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉపాధి హామీలో కొత్త కొత్త యాప్‌ల ద్వారా కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి 200 మంది ప్రతినిధులు వస్తారని, గత మూడు సంవత్సరాలు నిర్వహించిన పోరాటాలను చర్చించి రానున్న మూడు సంవత్సరాల కాలంలో కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులు యడ్ల చిట్టిబాబు, శేషపు ఆశ్రియ్య, వనం రాంబాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా, ముడే మోజేష్, సోడదాసి సంజీవరావు, యడ్ల మోహన్‌రావు, కావాడ మరియమ్మ, కండెల్లి రమేష్, బండారు వెంకటేశ్వరావు, పెచ్చెట్టి నరసింహమూర్తి పాల్గొన్నారు.


బంగారం, వెండి దొంగల అరెస్టు

గతేడాది జరిగిన కేసును చేధించిన పోలీసులు

చోరీ సొత్తు 71 శాతం రికవరీ : ఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని తూర్పు తాళ్ల గ్రామంలోని శ్రీదుర్గా జ్యూయలరీ షాపులో గత ఏడాది జరిగిన దొంగతనం కేసును పోలీసులు చేధించారు. గత ఏడాది సెప్టెంబర్ 14వ తేదీ రాత్రి షాప్ వెంటిలేటర్ ద్వారా ప్రవేశించి షాపులో ఒక కేజీ బంగారం, 2 కేజీల వెండి చోరీ చేశారు. ఆదివారం రాత్రి దొంగతనానికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 666 గ్రాముల బంగారం, 2 కేజీల 638 గ్రాముల వెండి, నాలుగు బైక్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి నయీం అస్మి తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసాపురం, మొగల్తూరు ప్రాంతాలకు చెందిన చిలకలపల్లి శివాజీ, ముత్యాల వరుణ్, సిద్దిరెడ్డి మనోజ్ కిరణ్, సిద్దిరెడ్డి సంతోష్ కుమార్‌ను అరెస్టు చేసామన్నారు. వీరిలో ఎ1, ఎ2 నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని జెబిరా స్కూల్ వద్ద ఎ3, ఎ4లను పట్టణంలోని కోవెల గుడి వద్ద పట్టుకున్నామన్నారు. వీరి నుంచి దొంగ సొత్తును నరసాపురం పట్టణానికి చెందిన రిషఫ్ జైన్, జవ్వాది శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్ కొనుగోలు చేసారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసామన్నారు. చోరీకి గురైన సొత్తులో



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

71 శాతం రికవరీ చేసామన్నారు. నిందుతులు నలుగురికి గతంలో ఎటువంటి నేర చరిత్ర లేదన్నారు. చెడు అలవాట్లకు బానిసై చోరీకి పాల్పడ్డారన్నారు. ఇటువండి చోరీలు జరగకుండా వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపారులు తెలియని వ్యక్తుల నుంచి దొంగ బంగారం కొనుగోలు చేయడం నేరమన్నారు. ఈ కేసును చేధించడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసులకు ఎస్‌పి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి భీమారావు, నరసాపురం డిఎస్‌పి శ్రీవేద, సిఐ జి.దుర్గా ప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, టి.వెంకట సురేష్, వై.నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అగచాట్లు..!

- ఎస్‌సి బాలికల వసతిగృహంలో గదుల కొరత
- బెడ్స్ లేక నేలపైనే నిద్ర
- పాతపాడులోని వసతిగృహంలో స్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో నాలుగు ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. మొగల్తూరులోని ఎస్‌సి బాలికల, బిసి బాలుర వసతి గృహాలు అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. ముత్యాలపల్లిలోని బిసి బాలికల వసతి గృహన్ని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తుపాను రక్షిత భవనంలో, పాతపాడులోని బిసి బాలికల వసతి గృహన్ని తుపాను రక్షిత భవనంలో ప్రారంభం నుండి అక్కడే నిర్వహిస్తున్నారు.

మొగల్తూరులోని ఎస్‌సి బాలికల వసతిగృహంలో 48 మంది విద్యార్థులు, బిసి బాలుర వసతి గృహంలో 39 మంది, ముత్యాలపల్లిలోని బిసి బాలికల వసతి గృహంలో 58 మంది, పాతపాడులోని బిసి బాలికల వసతిగృహంలో 33 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు.

మొగల్తూరులోని ఎస్‌సి బాలికల వసతి గృహంలో ఉన్న



పాతపాడులోని బిసి బాలికల వసతి గృహం

48 మంది విద్యార్థులకు నాలుగు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ వసతి గృహానికి మంచాల సరఫరా లేకపోవడంతో విద్యార్థినులు నేలపై నిద్రించవలసి వస్తుంది.

ప్రజాశక్తి పరిశీలన

పాత పాడులోని వసతి గృహంలో స్లాబ్ నుంచి నీరు లీకవుతుంది. ఆ భవనం చుట్టుపక్కల ఉన్న రహదారి కంటే భవనం పల్లంలో వుడటంతో గదులలో నేల తేమ చేరుతుంది. దీంతో విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహంలో 11 గదులు, మంచాలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయి.

వికలాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత

భీమవరం : స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వికలాంగుడైన గెడ్డం నరసింహ మూర్తికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్ ను సోమవారం అందజేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన భీమవరం 13వ వార్డుకు చెందిన వికలాంగుడు గెడ్డం నరసింహ మూర్తికి రూ.45 వేలు విలువచేసే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్ను జిల్లా కలెక్టర్ అందజేశారు. నరసింహామూర్తి భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తుంటారు. కలెక్టర్ అమ్మవారి దర్శనార్థం వెళ్లిన సందర్భంలో నరసింహమూర్తి కలెక్టర్ని ట్రై సైకిల్ ఇప్పించవలసిందిగా అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తక్షణమే స్పందించి వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ను అందజేశారు. దీంతో నరసింహ మూర్తి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్కుమార్ ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం : ఆర్డిఒ

నరసాపురం : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డిఒ దాసిరాజు హెచ్చరించారు. ఆర్డిఒ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డివిజన్లోని స్కానింగ్ సెంటర్లలో దశల వారీగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.ప్రసాద్, జి.సత్యవతి, అల్లూరి నళిని దేవి పాల్గొన్నారు.

స్టూడెంట్స్ అసెంబ్లీకి విద్యార్థినులు

మొగల్తూరు : అమరావతిలో ఈనెల 26న జరిగే స్టూడెంట్స్ అసెంబ్లీకి తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని తిరుమాని పూజశ్రీ నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించి వెళ్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్మెత్స రామరాజు తెలిపారు. సోమవారం నియోజకవర్గస్థాయిలో నరసాపురంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థిని తిరుమాని పూజశ్రీ అమరావతిలో నిర్వహించే స్టూడెంట్స్ అసెంబ్లీకి వెళ్తుందని రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం ఎంఇఒ పుష్పరాజ్యం, మొగల్తూరు ఎంఇఒలు జి.సాయిరామ్, యు.శామ్యూల్ జాన్, రామరాజు, పలువురు గ్రామస్తులు పూజశ్రీ, శిక్షణ ఇచ్చిన బళ్ల శ్రీనివాసు లను అభినందించారు.

ఆచంట : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన జీవితంతో పాటు గొప్ప భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంఇఒ-2 పి.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అమరావతిలో జరుగనున్న నమూనా అసెంబ్లీకి ఆచంట నియోజకవర్గస్థాయిలో 175 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో సోమవారం మార్టేరు ఎస్విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హోరాహోరీగా జరిగిన కార్యక్రమంలో అమరావతి నమూనా అసెంబ్లీ కార్యక్రమానికి పెనుమంట్ర గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి మనుగుల సాయిశ్రీ సాయిత్రిక మేఘం వర్షిత ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పి.రాజేంద్రప్రసాద్, వై.రవీంద్ర, క్విజ్ మాస్టర్ పి.రమేష్, సోషల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాల పంపిణీ

పాలకొల్లు రూరల్ : మండలంలోని పూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో తుపాన్ వల్ల నష్టపోయిన చేనేత కార్మికులకు(వివర్స్) ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను పాలకొల్లు మాజీ ఎఎంసి ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు సోమవారం చేనేత కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ 19 మంది లబ్ధిదారులకు 50 కిలోల బియ్యం, ఆయిల్ కేజీ, బంగాళాదుంపలు కేజీ, పంచదార కేజీ, ఉల్లిపాయలు కేజీ, కందిపప్పు కేజీ చొప్పున లబ్ధిదారులకు అందించామన్నారు. అధిక వర్షాల వల్ల చేనేత కార్మికులు పనులు లేక పస్తులుండకూడదనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు వి.శ్రీహరి రాజు, గుబ్బల ప్రసాద్, గినేటి రామకృష్ణ, దబ్బిడి స్వామి, ఉనికేల నాగేశ్వరావు, నన్నుబోయిన నాగరాజు, జనసేన నాయకులు నూకల శ్రీను రఘు, పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్, విఆర్ఒ బి.సుజాత, రేషన్ షాప్ డీలర్స్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అనంతపల్లి రాధాకృష్ణ మృతి

మొగల్తూరు : ఆర్యవైశ్య సంఘం మొగల్తూరు మండల మాజీ అధ్యక్షులు అనంతపల్లి రాధాకృష్ణ(బుల్లబ్బాయి 73) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. గత కొంతకాలంగా రాధాకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ భీమవరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సొంత గ్రామం మొగల్తూరు తీసుకువచ్చారు. ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సిపిఎం నాయకులు ఆదూరి సాంబమూర్తి, మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, ఆర్యవైశ్య మొగల్తూరు అధ్యక్ష కార్యదర్శులు సంక ముత్య రామ నాగేశ్వరరావు, అనంతపల్లి సాయిరామ్, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆయన మృతదేహం సందర్శించి నివాళులు అర్పించారు.

మాతృ మరణాలపై అంతర్గత సమీక్ష

భీమవరం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాభాయ్ అధ్వర్యాన మాతృ మరణాలపై సబ్ కమిటీ అంతర్గత సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ త్రైమాసికంలో జరిగిన మాతృ మరణాలు, కారణాలపై సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలతో చర్చించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధాలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్యనారాయణ, గర్భకోశ వ్యాధుల నిపుణులు మాధవి కళ్యాణి, ఐ.లక్ష్మి, మహిళా శిశుసంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ జి.పద్మ, డిపిహెచ్ఎన్ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి : ఆర్డిఒ

నరసాపురం : పిజిఆర్ఎస్లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 48 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, అధికారులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద నుంచి రక్షించాలని వినతి

తణుకు : కోతులు, కుక్కల బారినుండి రక్షించాలని తణుకు పట్టణం పైడిపర్రులోని సూర్యనగర్ కాలనీ ప్రజలు అధికారులను కోరుతున్నారు. సోమవారం మున్సిపల్ అధికారులకు సూర్యనగర్ కాలనీ ప్రజలను రక్షించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులైన అంబటి రామకృష్ణ, జి.నారాయణరావు, కాశీలు మాట్లాడుతూ.. పాడుపడ్డ ఇంటిలో కోతులు స్థిర నివాసం ఏర్పరుచుకుని కాలనీలో వృద్ధులు, పిల్లలు, మహిళలపై దాడులు చేస్తుండడంతో భయభ్రాంతులవుతున్నారన్నారు. ఇటీవల ఒక వృద్ధురాలిపై కోతి దాడి చేయడంతో ఆమె కింద పడి కాలు విరిగిన సంఘటన, మరో మహిళ అంట్లు కడుగుతుంటే వెనక నుండి కోతి దాడి చేయడంతో తలపై మూడు కుట్లు పడ్డాయన్నారు. కోతులు దాడి చేస్తుంటే ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. ఆర్థిక భారం ప్రజలపై పడుతుందన్నారు. కుక్కలు కూడా వీధుల్లో సమూహాలుగా తిరుగుతుంటే వీధుల్లో తిరగాలంటే భయపడుతున్నారని, కోతులు, కుక్కల బెడద నుండి రక్షించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తెలగంశెట్టి సుబ్బయ్య, చింతలపూడి అప్పారావు, నిట్టల రాధాకృష్ణ, పాలెపు రవికుమార్, అల్లూరి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

200 మందికి పరీక్షలు

ఆకివీడు : శ్రీవిద్యా వికాస్ డిగ్రీ కాలేజ్ ఆకివీడు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా సోమవారం కళాశాల దత్తత గ్రామం సిద్ధాపురంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నైపుణ్యతని పెంచడానికి అన్నివేళలా సహకరిస్తామని కళాశాల డైరెక్టర్ శ్రీకొమ్మల సుబ్రహ్మణ్యం అన్నారు. సుమారు 200 మందికి ఉచితంగా వైద్యం అందించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

శాంతి రధం ప్రారంభం

తణుకు : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక గమిని ఫంక్షన్ హాల్ వద్ద మానవత ఆధ్వర్యాన 2వ శాంతి రధాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మస్తాన్రావు(బాబి) రూ.3 లక్షల 50 వేల విరాళంతో శాంతి రధాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మెన్ గమిని రాంబాబు, జిల్లా కన్వీనర్లు బి.రామలక్ష్మి, ఎస్వి.సతీష్బాబు, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రాధాపుష్పావతి, డాక్టర్ కె.రామలక్ష్మి, డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అసమానతలపై పోరాడిన కార్మిక నేత బాబూరావు

సంతాప సభల్లో నేతలు

ప్రజాశక్తి - భీమవరం



భీమవరంలో నివాళులర్పిస్తున్న నేతలు



పెంటపాడులో..

సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాడిన కార్మిక నేత చింతకాయల బాబురావు అని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు అన్నారు. భీమవరంలో బాబూరావు చిత్రపటానికి సోమవారం కెవిపిఎస్ జిల్లా బృందం ఆధ్వర్యాన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్, క్రాంతిబాబు మాట్లాడుతూ చింతకాయల బాబూరావు హఠాన్మరణం సామాజిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఏలూరు జిల్లా కార్యదర్శిగా, సిఐటియు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కేంద్ర కౌన్సిల్ సభ్యునిగా అనేక పదవులను అధిరోహించి ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో కీలకంగా వ్యవహరించారని కొనియాడారు. 1998లో కెవిపిఎస్ సంఘం జిల్లాలో తాడేపల్లిగూడెంలో నిర్మాణంలో బాబూరావు కృషి ఎనలేనిదన్నారు. ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ చట్టం సాధించడంలో కెవిపిఎస్ చేసిన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు. గ్రామాల్లో కులవివక్ష, అంటరానితనం నేరం, వాటిని పాటిస్తే సహించబోమని జరిగిన జిల్లా వ్యాప్త సైకిల్ యాత్రలో భాగస్వామ్యం అయ్యారన్నారు. దళితులపై జరిగే దాడులకు వ్యతిరేకంగా, దళితులకు అండగా ఎన్నో పోరాటాల్లో చురుగ్గా పాల్గొనే వారని, అలాంటి వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమన్నారు. కెవిపిఎస్ జిల్లా నేతలు బత్తుల విజయ్ కుమార్, చిన్నం చిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెంటపాడు : పోరాటాల ముద్దుబిడ్డ చింతకాయల బాబూరావుకి సోమవారం తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వద్ద సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన నివాళులర్పించారు. ముందుగా బాబూరావు చిత్రపటానికి సిఐటియు నాయకులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అల్లూరు సత్యనారాయణ, ఆర్ఎస్, కొల్లా వెంకటరత్నం ఇటువంటి అగ్ర నాయకుల సమక్షంలో పనిచేసిన వ్యక్తి ఆయనని, తాడేపల్లిగూడెం మార్కెట్లలో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగేవని, అన్నింటిలోని ఆయన ప్రత్యక్ష పాత్ర ఉందని తెలిపారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు తెలిపారు. కార్యక్రమంలో కర్రిసాయి రెడ్డి, ఎస్ఎస్.రెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, ఆడప ఆంజనేయులు, గాది వెంకటరావు, మద్దాల పుత్రయ్య, ఆకుల నారాయణ, బుద్దాల నాని, అనేకమంది యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

ఎల్బి చర్ల పిహెచ్సి వైద్యులు ఎం.మాధురి

ప్రజాశక్తి - నరసాపురం



అధిక వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్బి చర్ల పిహెచ్సి డాక్టర్ ఎం.మాధురి తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోరాదని సూచించారు. నివాస గృహాల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ఆశా కార్యకర్త, లేదా దగ్గరలోని పిహెచ్సిని సంప్రదించాలని తెలిపారు.

మన సంస్కృతిలో డాక్టర్ వెంపటాపు చిత్రం

తణుకు : మన సంస్కృతి పేరిట ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ బాలోత్సవ్ భవన్ విజయవాడలో ఆదివారం నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు నమో అంతర్ముఖి శీర్షికతో చిత్ర రచన చేసిన చిత్రంతో పాల్గొని పలువురి మన్ననలు అందుకున్నారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 70 మంది చిత్రకారులు పాల్గొని 'మన సంస్కృతి' ప్రతిబింబించే వివిధ చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంపటాపు చిత్రాన్ని తిలకించిన శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఛైర్పర్సన్ రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ కమిషన్ తేజస్వి పొడపాటి, ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమి శరత్ చంద్ర(ఆర్డి విల్సన్), సమాజ సేవకులు గోళ్ళ నారాయణరావు, ఆర్ట్ అసోసియేషన్ గిల్డ్ అధ్యక్షులు డాక్టర్ బి.ఎ.రెడ్డి, కన్వీనర్ పి.రమేష్లు డాక్టర్ వెంపటాపునకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం, దుశాలువతో సత్కరించారు.

మరో అవార్డు..

ఉత్తరప్రదేశ్ బరెల్లికి చెందిన కళా రత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్లైన్ ఆర్ట్ కాంపిటీషన్లో డాక్టర్ వెంపటాపు 'కళ గౌరవ్ సమ్మాన్' అవార్డును కూడా అందుకున్నారు. ఆర్ట్ ఎగ్జిబిషన్, ఆర్ట్ కాంపిటీషన్లలో విజేతగా నిలుస్తూ కళా సేవ చేస్తున్న వెంపటాపును తణుకు పట్టణ ప్రముఖులు, స్వగ్రామం ఇరగవరం ప్రముఖులు అభినందించారు.

ప్రతియేటా ఉచిత కంటి వైద్య శిబిరాలు

నియోజకవర్గంలో అంధత్వ నివారణకు చర్యలు : ఎంఎల్ఎ

తణుకు : తణుకు నియోజకవర్గంలో అంధత్వ నివారణకు ఏడాదికి రెండు, మూడు పర్యాయాలు కంటి వైద్య శిబిరాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇటీవల తణుకులో ఎంఎల్ఎ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ సోమవారం తణుకు కూటమి కార్యాలయంలో ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ.. 228 మందికి శస్త్రచికిత్సలు చేయాల్సిన పరిస్థితి ఉందని, వారందరికీ త్వరలోనే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 96 మందికి కంటి చూపు మందగించడంతో వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 125 మందికి కళ్లజోళ్లను అందజేశామన్నారు. వైద్య శిబిరం జరిగిన రోజే మరో 380 మందికి కళ్లజోళ్లు అందజేశామని వెల్లడించారు. మొత్తం మీద 1127 మందికి క్యాట్రాక్ట్ శస్త్ర చికిత్సలతో పాటు కళ్లజోళ్లను అందించామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

6న ఎడి కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న జిల్లా ఎడి కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నరసాపురం ముద్దాల వారి వీధిలో బల్ల వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు జరుపుతానని చెప్పి 14 నెలలు గడిచినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేలు ఇస్తానని ప్రకటించి అమలు జరగలేదని, వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సభ్యులు టి.శ్రీనివాసరావు, బోపెశంకర్రావు, గుడిమెట్ల సుబ్బారావు, తిప్ప శివ నాగేశ్వరి, వాసా రామలింగం, కాసా కోటేశ్వరరావు, కోట నాగయ్య పాల్గొన్నారు.

సమీక్ష అంటే లెక్కలు చెప్పడం కాదు

పనిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

భీమవరం టౌన్ : ఉద్యోగస్తులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని శాసనమండలి ఛైర్మన్ మోషేను రాజు, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ అంజిబాబు, ఎంఎల్సి కౌరు శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ కలిదిండి సుజాత రామచంద్ర రాజు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ను మొంథా తుపాన్ ప్రభావంతో ఎంత పంట నష్టం దెబ్బతింది, అలాగే ప్రభుత్వం నుంచి వచ్చేది ఎంత, పంటకి ఇన్సూరెన్స్ ఎన్ని ఎకరాలకు చేయించారని ప్రశ్నించారు. వ్యవసాయాధికారి పూర్తి లెక్కలు లేవని చెప్పడంతో వారు కొంత అసహనం వ్యక్తం చేశారు. రివ్యూ మీటింగ్ అంటే లెక్కల మీటింగ్ అనుకుంటున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఎకరాలు భూమి ఉంది, ఏఏ పంటలు ఉన్నాయి, రైతులు ఎంతమంది, ఏమి ఎరువులు వాడుతున్నారు ప్రతీ లెక్కా ఉండాలని సూచించారు. జెడ్పిటిసి కాండ్రేకుల నరసింహారావు, ఎంపిడిఒ గంగాధర్ రావు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రేపు కొమ్మరలో ఉచిత పశువైద్య శిబిరం

గణపవరం : ఈనెల 5వ తేదీన జల్లికొమ్మర రైతు సేవాకేంద్రం వద్ద మెగా ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పశువర్ధక అసిస్టెంట్ డైరెక్టర్ డిఎం నాయక్ సోమవారం చెప్పారు. పశువైద్య శిబిరంలో దీర్ఘకాలిక, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందజేయటం జరుగుతుందని చెప్పారు. వైద్యశిబిరానికి వచ్చే రైతులు ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. అనంతరం లేగదూడల ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. పోటీలలో గెలుపొందిన లేగదూడల రైతులకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు

పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్




కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి

తాడేపల్లిగూడెం: రైతులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్తో కలిసి సోమవారం మండలంలోని ఆరుగొలనులో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని, ఎవరూ అధైర్య పడొద్దని అన్నారు. గత రబీ సీజనలను సీజన్లో కూడా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసి నిర్ణీత గడువు కంటే ముందుగానే ధాన్యం నగదును జమ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు కూడా కోట్లాది రూపాయలను రైతులకు బకాయిలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టిందని, కూటమి ప్రభుత్వం రాగానే రూ.1,674 కోట్ల బకాయిలను రైతులకు జమచేయడం జరిగిందని, అలాగే రూ.400 కోట్ల బకాయిలను మిల్లర్లకు చెల్లించడం జరిగిందన్నారు. కౌలు రైతులను తప్పకుండా ఆదుకుంటామన్నారు. కౌలు రైతులకు నూరు శాతం సబ్సిడీపై 50 వేల తార్పాలిన్లను ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అవసరమైన గన్ని బ్యాగులను సిద్ధం చేయడం జరిగిందని, ఎక్కడ గన్ని బ్యాగుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించేందుకు 34 వేల వాహనాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భారతదేశంలోనే మొట్ట మొదటిసారి వాట్సాప్ ద్వారానే మీరు కోరుకొన్న మిల్లుకు, నచ్చిన తేదీల్లో దాన్ని అమ్ముకునేందుకు సాంకేతికతను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఫిర్యాదుకు 1967కు కాల్ చేయాలని 7337359375 నెంబర్కు వాట్సాప్లో హాయ్ పెట్టి మీకు నచ్చిన తేదీ, సమయంలో అమ్మకాలు చేయవచ్చన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొలిశెట్టి మాట్లాడారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ విసి అండ్ ఎమ్డీ ఢిల్లీరావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు, ఛైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, చిర్రి బాలరాజు, సొంగా రోషన్ కుమార్, ఆర్టిసి రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వల్లే ప్రభుత్వానికి మంచి పేరు

తహశీల్దార్ రామాంజనేయులకు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం



రామాంజనేయులను సత్కరిస్తున్న నాయకులు

మొంథా తుపాన్ విపత్తును ఎదుర్కోవడంలో అధికారుల సమిష్టి కృషి వల్లే టిడిపి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి చంద్రశేఖర్ అన్నారు. తుపాను సమయంలో అధికారులు చేసిన సేవలను ప్రశంసిస్తూ ఎంపిపి దుర్గాభవాణి అధ్యక్షతన జరిగిన సత్కార సభలో తహశీల్దార్ ఎమ్.వి.రామంజనేయులు, ఎంపిడిఒ వైభవతి, విద్యుత్, ఇరిగేషన్, పోలీస్, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ, మండల స్థాయి అధికారులైన అప్పారావు, సత్యనారాయణ, రాజ్కుమార్, బిస్సీబాబు, ఎపిఎం జ్యోతిరాణి, ఎంపిడిఒ సూపరింటెండెంట్ అప్పారావు, ఇన్ఛార్జి ఇఒపిఆర్డి ఫణి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, కళ్యాణిలను సత్కరించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో శక్తివంచన లేకుండా పని చేశామన్నారు. ఇదే పనితీరును కొనసాగిస్తామన్నారు. తుపాను సమయంలో పంచాయతీ కార్యదర్శుల సహకారం వల్లే ఏ విపత్కరమైన పరిస్థితినైనా ఎదుర్కోగలమన్న విశ్వాసం వచ్చిందన్నారు. పునరావాస కేంద్రాలలోని బాధితులకు భోజనం, అల్పాహారం అందించిన మళ్ల తులసీరాం, యరకరాజు హరిబాబు, చినబాబును తహశీల్దార్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు పెంటకోటి సైదేశ్వరావు, అంగర కుటుంబరావు, సర్పంచి వేండ్ర లీలావెంకటకృష్ణ, రాయకుదురు సొసైటీ ఛైర్పర్సన్ తోట విజయ్కుమార్, నాయకులు యిర్రింకి మాధవ, మళ్ల శ్రీరామ్మూర్తి, కురెళ్ల నరసింహారావు, గెడ్డం భాస్కరరావులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టీమ్కు అభినందన : ఎంఎల్ఎ

తణుకు : మొట్టమొదటిసారిగా మహిళా క్రికెట్ లో మొదటిసారి భారత్ ప్రపంచకప్ సాధించటం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మహిళ క్రికెట్ వరల్డ్ కప్ ఇండియా గెలుపొందడం పట్ల సోమవారం తణుకు కూటమి కార్యాలయంలో ఎంఎల్ఎ రాధాకృష్ణ ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది మంది భారతీయులు తన అభిమానాన్ని క్రికెట్లో ఆరాధిస్తూ ఉంటారని చెప్పారు. ఈ క్రమంలో మొట్టమొదటిసారిగా మహిళ క్రికెట్ ప్రపంచకప్ భారతదేశం సాధించడం గర్వకారణమన్నారు. మహిళల్లో స్ఫూర్తి పెంచే విధంగా ప్రపంచ కప్ ఫైనల్లో క్రీడాకారులు చూపిన ప్రతిభ భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని అన్నారు. దక్షిణాఫ్రికాను ఓడించి ప్రపంచ కప్ కైవసం చేసుకోవడం దేశానికి గర్వకారణమని రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఐసిసి ప్రపంచ మహిళ క్రికెట్ ఛాంపియన్షిప్ భారత మహిళా టీం ఇండియా జట్టు కైవసం చేసుకున్న సందర్భంగా స్థానిక వాణి పబ్లిక్ స్కూల్లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వాణి కృష్ణ మాట్లాడుతూ భారత మహిళా జట్టు ఎంతో పట్టుదలతో చిరకాల లక్ష్యాన్ని చక్కని సమిష్టి కృషితో సాధించారని, మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా ఎదుగుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె బాలికలను ఉత్తేజపరిచే విధంగా భారత మహిళా క్రికెట్ జట్టును ఆదర్శవంతంగా తీసుకొని విద్యార్థినిలు అన్ని రంగాల్లోనూ ముందంజ వేయాలని తెలిపారు. భారత జాతీయ పతాకాలు చేత బూని జయహో భారత్ అంటూ విద్యార్థినుల నినాదాలతో భారత మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు తెలియజేశారు.



తాడేపల్లిగూడెంలో..

డ్రగ్స్, నిరుద్యోగంపై యువకులు ఐక్యంగా పోరాడాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్వివిఎస్.శర్మ

ఆచంట : మాదకద్రవ్యాలు, డ్రగ్స్కు వ్యతిరేకంగా యువజనులంతా ఐక్యంగా పోరాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ఎస్వివిఎస్.శర్మ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సంత మార్కెట్ వద్ద డివైఎఫ్ఐ జెండాను శర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు తమరాపు దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ 1980వ సంవత్సరంలో పంజాబ్ రాష్ట్రంలోని లుథియానాలో డివైఎఫ్ఐ సంఘం ఏర్పడిందని వివరించారు. 'అందరికీ విద్య - అందరికీ ఉపాధి' నినాదంతో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు డివైఎఫ్ఐ నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. నాటి నుండి నేటి వరకు దేశంలోని యువజనుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న అగ్రగామి సంఘం డివైఎఫ్ఐ మాత్రమేనని తెలిపారు. సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి, మద్యం, జూదం లాంటి వ్యసనాలు యువత శక్తిని నిర్వీర్యపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు దేశంలో నానాటికి పెరుగుతున్న తీవ్రమైన నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతున్నారని, ఈ అసమానతలకు కారణమైన ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యువత నిరుద్యోగ సమస్యపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తక్షణమే నిరుద్యోగ భృతి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కడలి రమణ, ఎ.సురేష్ బాబు, బి.దుర్గాప్రసాద్, పి.వల్లపురాజు, జి.లాల్ బాబు, మానసి, సామ్యూల్, దిలీప్ కుమార్, షాలేం రాజు పాల్గొన్నారు.

'టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి'

భీమవరం : టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పిఎస్.విజయరామరాజు అన్నారు. ఫ్యాప్టో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి శివన్నారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం సూపరిటెండెంట్ తిరుపతిరాజుకు జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యాన సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు మాట్లాడుతూ గత 30, 25 సంవత్సరాల నుంచి భోధనలో ఉన్న ఉపాధ్యాయులు ఇటీవల వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ రాయాలని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి చట్టపరమైన మార్పులు చేయడం ద్వారా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలిపారు. సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం పాల్గొన్నారు.

ఘనంగా అమర్త్యసేన్ జయంతి

పాలకొల్లు : పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమర్త్యసేన్ జయంతి ఘనంగా నిర్వహించారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నోబెల్ ప్రైజ్ గ్రహీత అమర్త్యసేన్ 92వ జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ అర్థశాస్త్రంలో భారతదేశ నుంచి నోబుల్ ప్రైజ్ తీసుకున్న ఆర్థికవేత్త అమర్త్యసేన్ అని, సంక్షేమ అర్థశాస్త్రంలో అతని చేసిన పరిశోధనలు ప్రాముఖ్యమైనవని విద్యార్థులకు వివరించారు.

వికలాంగునికి కంటి ఆపరేషన్

పెనుమంట్ర : కంటి చూపు కోల్పోయి అంధత్వంతో చాలా కాలంగా బాధపడుతున్న పండిత విల్లూరు గ్రామానికి చెందిన వికలాంగుడు తమ్మినీడి కేశవరావుకు మార్టేరులోని మండల మానవతా ప్రతినిధులు ఆపరేషన్ చేయించి కంటి చూపు తెచ్చి, మానవత్వం చాటుకున్నారు. సోమవారం ఆయనకు పాలకొల్లులోని అమరావతి ఐ హాస్పిటల్లో ఉచిత కంటి ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల కేశవరావు కుటుంబ సభ్యులు, మానవత సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఛైర్మెన్ కడలి సుబ్రహ్మణ్యం, ప్రెసిడెంట్ శిరం విశ్వ నాథం, కమిటీ మెంబర్సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు

పాలకొల్లు రూరల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు చాలా మంది రాకపోవడంతో ఖాళీ కుర్చీలతో సర్వసభ్య సమావేశం సాగింది. ఈ సమావేశానికి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షత వహించారు. ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోడి విజయభాస్కర్ మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే ఈ సమావేశానికి సైతం అధికారులు సరిగ్గా హాజరు కాకపోవడం మంచిది కాదన్నారు. అలాంటప్పుడు ప్రజల సమస్యలు ఎలా తెలుసుకుని పరిష్కరిస్తారని ఎంపిడిఒ ఉమామహేశ్వరావును ప్రశ్నించారు. తర్వాత జరిగే సమావేశానికి ప్రతి ఒక్క అధికారి హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఎండిఒ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ మూర్తి బాబు, వైద్యాధికారి గుడాల హరిబాబు, వ్యవసాయాధికారి రాజశేఖర్, మత్స్యశాఖ అధికారి శరత్ బాబు హాజరయ్యారు.